వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



చిక్కడపల్లి: కాలనీలు, బస్తీల్లో వివిధ సంస్థలు ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మాచర్ల దేవనాథం అన్నారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయం, ముషీరాబాద్ కేర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం దేవనాథం మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని అన్నారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ అప్సర నేతత్వంలో బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆరోగ్య సలహాలు సూచనలు చేశారు. ఆలయ సిబ్బంది ఎస్వీబీఎస్ ఆచారి, అర్చకులు, సిబ్బంది, శివాజీ రావు పటేల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లకుంటలో కాంగ్రెస్ సంబురాలు



నల్లకకుంట: వరంగల్, నల్లగొండ, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీగా తీన్మార్ మల్లన్న గెలుపొందడం పట్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం నల్లకుంట శంకర్‌మట్ మార్కెట్ రోడ్డులో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్‌లో వ్యాపారులు, బాటసారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, ఉమ్మడి ఏపీ పీసీసీ ఎస్సీ విభాగం మాజీ అధ్యక్షుడు శ్యామ్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్.హరినాథ్‌రెడ్డి, రామ్మోహన్‌రావు, బి.కాంతారావు, ఎడ్ల నరేందర్‌రెడ్డి, సి.హెచ్.మురళీకృష్ణ, దేవిరెడ్డి విజితారెడ్డి, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా భావంతో పనిచేస్తే గుర్తింపు



చీరలను పంపిణీ చేస్తున్న దృశ్యం

కాచిగూడ: సామాజిక సేవల్లో భాగంగా పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాల్సిన అవసరం ఉందని ఆర్మీ స్కూల్ ప్రిన్సిపాల్, ఎన్ఆర్ఐ సుశీల దూది అన్నారు. విమల సుధాకర్ రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ దేవిరెడ్డి విజితారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కూచికుళ్ల విమల సుధాకర్ రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బర్కత్‌పురాలో జీహెచ్‌ఎంసీ స్వీపర్స్ చీరలు, బ్రీతింగ్ లైజర్స్, సానిటైజర్, పండ్లు, బ్రెడ్ ప్యాకెట్లను సుశీల దూది, విజితారెడ్డి పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సుశీల మాట్లాడుతూ... తల్లిదండ్రులకు మగవాళ్లే వర్ధంతి, జయంతి తదితర కార్యక్రమాలు చేస్తారనే విషయం అపోహలే అని.. మహిళలు కూడా ఆయా కార్యక్రమాలను చేస్తారని దేవిరెడ్డి విజితారెడ్డి నిరూపించారని అన్నారు.

హోటళ్ల తనిఖీలు సరే..

సంక్షేమ హాస్టళ్ల పరిస్థితి ఏమిటి?

జీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ

కాచిగూడ: రాష్ట్రంలో ఉన్నతాధికారులు హోటళ్లు, ఆర్‌టీఏ ఆఫీసులు, రిజిస్ట్రార్ తదితర ఆఫీసులు తనిఖీలు చేస్తున్నారు సరే.. మరి విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లను, కార్పొరేట్ విద్యా సంస్థలను ఎందుకు తనిఖీలు చేయడం లేదని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శనివారం కాచిగూడలో ఆయన మాట్లాడుతూ... విద్యార్థుల సంక్షేమ హాస్టళ్లలో సరైన భోజన వసతి, మంచినీటి సౌకర్యం లేక విద్యార్థులు రోగాల బారిన పడుతున్నా ప్రభుత్వం, అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చాలా మంది అధికారులు అక్రమ సంపాదనకు అలవాటు పడటంతోనే డబ్బులు వస్తున్న విభాగాల్లోనే తనిఖీలు చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, విద్యార్థుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన తెలిపారు. ప్రతి రోజూ నీళ్లచారు, పురుగుల అన్నం తింటున్నారని, దీంతో అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. అందరికి సమాన విద్య అందించేందుకు ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలు రోజురోజుకు పెరిగిపోతుండటంతో వెంటనే విద్యాశాఖ మంత్రిని నియమించి విద్యార్థుల సమస్యలు సత్వరమే పరిష్కరించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి కృషి చేయాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ హాస్టళ్లకు స్వంత భవనాలను నిర్మించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. త్వరలోనే బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశాన్ని నిర్వహించి విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ ఉద్యమాన్ని ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో చేపడతామని అన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం నాయకులు వంశి, నిఖిల్, ప్రవీణ్, వరుణ్, హరీష్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ భోలక్‌పూర్ ఉపాధ్యక్షుడు శివకుమార్ మృతి



శివకుమార్ (ఫైల్)

ముషీరాబాద్: బీఆర్ఎస్ పార్టీ భోలక్‌పూర్ డివిజన్ ఉపధ్యక్షుడు జె.పి.శివకుమార్(43) అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యానికి గురైన ఆయన కొన్ని రోజులుగా గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య క్షీణించి మరణించారు. ఆయనకు భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్ అయిన శివకుమార్ పేద కుటుంబానికి చెందినవారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ గ్రేటర్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ, భోలక్‌పూర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు రవికుమార్‌లు రంగానగర్‌లోని శివకుమార్ ఇంటికి వెళ్లి ఆయన భౌతికకాయం వద్ద నివాళులు అర్పించారు. వారి కుటుంబానికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా శివకుమార్ కుటుంబానికి ముఠా జైసింహ రూ. 10 వేల సాయాన్ని అందజేశారు. శివకుమార్ అంత్యక్రియలు బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరిగాయి.

గోరక్షణకు ప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలి

భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ డిమాండ్



మాట్లాడుతున్న సంఘ్ ప్రతినిధులు

హిమాయత్‌నగర్: బక్రీద్ పండుగను పురస్కరించుకుని హైదరాబాద్ నగరానికి వివిధ జిల్లాల నుంచి గోవులను తరలించడాన్ని ప్రభుత్వం అరికట్టాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. గోవులను రక్షించడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం అయ్యాయని సంఘ్ ప్రతినిధులు ఆరోపించారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘ్ అధ్యక్షుడు రాజ్ శ్రీమాల్, కార్యదర్శి మహేష్ అగర్వాల్ మాట్లాడుతూ... నగరానికి నిత్యం వేలాదిగా ఆవులు, ఎద్దులు, దూడలను అక్రమంగా తరలిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం చెక్ పోస్టుల వద్ద పెద్ద ఎత్తున తనిఖీలను నిర్వహించి, వాటిని తిరిగి స్వస్థలాలకు పంపాలని, లేకపోతే ఈ నెల 10వ తేదీ నుంచి రోడ్లపైకి వచ్చి ఆవులను తరలిస్తున్న వాహనాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. రాష్ట్రంలో గోసంరక్షణ చట్టం ఉన్నా అమలు చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే గోవధ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని, అక్రమంగా గోవులను తరలిస్తున్నవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రతినిధులు రిదేష్ జాగీర్దార్, జస్మత్ పటేల్ పాల్గొన్నారు.

ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడాలి

లిబర్టీ: ఉమ్మడి కుటుంబ వ్యవస్థను కాపాడుకోవాలని మాతృదేవోభవ సంస్థ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ కోరారు. భారతీయ సంస్కృతిలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఎంతో గొప్ప పేరు ఉందని ఆయన గుర్తు చేశారు. శనివారం లిబర్టీ ప్లాజాలోని సంస్థ కార్యాలయంలో జరిగిన సత్సంగ్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారాయని విచారం వ్యక్తం చేశారు. చిన్నచిన్న కారణాల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థల్లో వివాదాలు నెలకొని తల్లిదండ్రులను వదిలిపెట్టి పిల్లలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచిని పెంచి మానవతను పెంచాలని కోరారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న ముషీరాబాద్ చేపల మార్కెట్



ముషీరాబాద్ చేపల మార్కెట్ కిటకిట

- మృగశిర కార్తె డిమాండ్‌ను క్యాష్ చేసుకున్న వ్యాపారులు
- సాధారణ రోజుకన్నా పెరిగిన చేపల ధరలు
- తూనికల కొలతల శాఖ అధికారుల తనిఖీలు



తనిఖీ చేస్తున్న తునికల కొలతల శాఖ అధికారులు

ముషీరాబాద్: మృగశిర కార్తె సందర్భంగా శనివారం ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము 1.30 గంటల నుంచే మార్కెట్‌లో చేపల విక్రయాలు కొనసాగాయి. నగరంలో చేపమందు పంపిణీ చేస్తుండటంతో ముషీరాబాద్ చేపల మార్కెట్‌లో సైతం కొనుగోలుదారులతో మార్కెట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మకాలు సాగాయి. చేపల ధరలు సైతం విపరీతంగా పెరిగినా మృగశిర కార్తె నేపథ్యంలో చేపల ప్రియులు కొనుగోలు చేశారు. కొర్రమీను కిలో రూ. 500 నుంచి రూ. 600కు విక్రయించారు, రవ్వ చేపలు కిలో రూ. 120–130, బొచ్చ చేపలు 110–120 ప్రకారం విక్రయించారు. శుక్రవారం ధరలతో పోల్చితే కిలో రూ. 30 వరకు పెరిగాయి. మార్కెట్‌కు 50 నుంచి 60 టన్నుల చేపలు దిగుమతి అయ్యాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

- తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్, కరీంనగర్, నల్లగొండ, నిజామాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్ నుంచి సైతం చేపలు దిగుమతి అయ్యాయి. మృగశిర కార్తె ప్రారంభరోజు ఎలాగైన చేపలు తినాలనే ఆనవాయితీ కారణంగా మార్కెట్‌కు కొనుగోలు దారులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. డిమాండ్‌కు అనుగుణంగా వివిధ జిల్లాల నుంచి చేపలను తీసుకొచ్చిన భారీ వాహనాలను రోడ్లపైనే నిపారు. ఆయా వాహనాలు కొనుగోలుదారుల వాహనాలతో పరిసర ప్రాంతాలలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

మార్కెట్‌లో అధికారుల తనిఖీలు...

చేపల మార్కెట్‌లో విక్రయాలు పెద్ద ఎత్తున కొనసాగుతుండటంతో శనివారం తూనికలు కొలతల శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. తూకాలను పరిశీలించారు. అవకతవకలకు పాల్పడకుండా... వినియోగదారులు నష్టపోకుండా అధికారులు ఉదయం నుంచి మార్కెట్‌లోనే ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. దీంతో విక్రయదారులు ఆందోళనకు గురయ్యారు.

గంజాయి మత్తులో స్నేహితుడిపై దాడి



గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తరుణ్

ముషీరాబాద్: గంజాయి మత్తులో స్నేహితుడి పైనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... తరుణ్, సల్మాన్‌లు ఇద్దరు స్నేహితులు, భోలక్‌పూర్ డివిజన్‌లోని రంగానగర్‌లో నివసిస్తున్నారు. ఇద్దరి మధ్య వివాదం తలెత్తడంతో ఘర్షణకు దిగారు. దీంతో ఆగ్రహానికి గురైన సల్మాన్ గంజాయి సేవించి వచ్చి రాయితో దాడి చేయడంతో తరుణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. అతడు ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సల్మాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

నియామకం



నియామక పత్రం ఇస్తున్న ఆనంద్‌గౌడ్

నల్లకుంట: బీజేపీ ఓబీసీ మోర్చా తెలంగాణ ప్రచార కార్యదర్శిగా నల్లకుంట టీఆర్టీ కాలనీకి చెందిన ఎస్.నర్సింగ్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని శనివారం బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్ ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా నరింగ్‌రావు మాట్లాడుతూ... బీసీలను ఐక్యం చేసి బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

ఎరుకల సమస్యలు పరిష్కరించాలి



చిక్కడపల్లి: గత ప్రభుత్వంలో ఎరుకల కులస్తుల సమస్యలు ఏ మాత్రం పరిష్కారం కాలేదని తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం ప్రతినిధులతో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి అధిక నిధులు కేటాయించి, పాలక మండలిని ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా తమ కులస్తులు విద్యా, ఉద్యోగ, ఉపాధి, రాజకీయంగా వెనుకబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమ వర్గానికి నామినేటెడ్ పదవులు కల్పించాలని, కులవృత్తి పై ఆధారపడ్డ కుటుంబాలకు ఇప్పటికీ ఇల్లు, భూములు లేవని తెలిపారు. ఎస్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు అందడంలేదన్నారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎరుకల ఎన్పోర స్కీమ్ అమలు చేయాలని కోరారు. హైదరాబాద్ కేంద్రంగా ఏకలవ్య భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభించలేదన్నారు. ఇప్పటికైనా స్పందించి తమకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కార్యాచరణ ప్రణాళిక చేపడతామని హెచ్చరించారు. నేతలు వనం రమేష్, అశోక్ పాల్గొన్నారు.

చెత్తను తొలగించడంలో నిర్లక్ష్యం



పేరుకుపోయిన చెత్తను చూపిస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్

కాచిగూడ: రోడ్లపై పేరుకుపోయిన చెత్తను తొలగించడంలో జీహెచ్‌ఎంసీ అధికారులు, సిబ్బంది పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమ రమేష్ యాదవ్ ఆరోపించారు. రోడ్లపై పేరుకుపోయిన చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని సిబ్బందికి, అధికారులకు సూచిస్తున్నా వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కాచిగూడ డివిజన్ లోని చెప్పల్ బజార్, నింబోలిఅడ్డా, కుద్బిగూడ, బర్కత్‌పురా తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆహ్వానాన్ని మన్నించి.. ఆతిథ్యం స్వీకరించి..!

దళిత మహిళ ఇంట్లో కార్పొరేటర్ బాబా భోజనం



యాదమ్మ కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేస్తున్న బాబా ఫసియుద్దీన్

రహమత్‌నగర్: ఓ దళిత నాయకురాలి ఆహ్వానాన్ని మన్నించారు బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్. ఆమె కోరిక మేరకు కుటుంబ సభ్యులతో కలిసి ఆమె ఇంట భోజనం చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులు, పార్టీ నాయకుల సంబరాలను పక్కకు పెట్టి ఆ దళిత మహిళ పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకున్నారాయన. వివరాలివీ... బోరబండ కార్పొరేటర్ బాబా ఫసీయుద్దీన్ పుట్టిన రోజు సందర్భంగా వీకర్ సెక్షన్ పెద్దమ్మనగర్‌లో రొట్టెలు అమ్ముకుని కుటుంబాన్ని పోషించుకునే దళిత నాయకురాలు సంగమాల యాదమ్మ తన ఇంట్లో భోజనం చేయాలని బాబాను కోరింది. ఆమె కోరికను మన్నించిన బాబా శుక్రవారం రాత్రి ఆమె నివాసానికి వెళ్లి ఆమె కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేశారు. బాబా తమతో కలిసి భోజనం చేయడం పట్ల యాదమ్మ కుటుంబ సభ్యులు ఎంతగానో ఆనందించారు. ఈ సందర్భంగా బాబాను పలువురు అభినందించారు. యాదమ్మ కుటంబ సభ్యులతో ఆప్యాయతగా భోజనం చేయడంతో ఎంతో సంతృప్తికరంగా ఉందని బాబా స్పష్టం చేశారు.

'బీజేపీకి మద్దతు ఉపసంహరించుకోండి'



మాట్లాడుతున్న మునీర్ పటేల్ తదితరులు

హిమాయత్‌నగర్: దేశ ప్రజల ప్రయోజనాలు, సమగ్ర అభివృద్ధి, భవిష్యత్తు కోసం టీడీపీ, జేడీయూ పార్టీలు బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి తక్షణమే తమ మద్దతు ఉపసంహరించుకోవాలని సీపీఐ అనుబంధ సంస్థ అఖిల భారత తంజీమ్ ఏ ఇన్సాఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మునీర్ పటేల్, ఉపాధ్యక్షుడు ఎం.డి.అహ్మద్‌ఖాన్ డిమాండ్ చేశారు. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... గడచిన పదేళ్లలో కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అరాచక విధానాలతో దేశ ప్రతిష్ఠను దిగజారిన విషయం చంద్రబాబు నాయుడు, నితీష్‌కుమార్‌లకు తెలియదా అని ప్రశ్నించారు. సమావేశంలో సంస్థ గ్రేటర్ హైదరాబాద్ సమితి ప్రధాన కార్యదర్శి ఎం.డి.ఖాసీం, రాష్ట్ర నాయకులు ఎండి.మజారుద్దీన్, ఎం.డి.యూసుఫ్, ఎం.డి.చాంద్ పాషా, ఎం.డి.సమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు సాఫీగా వెళ్లేలా...

మార్గాలను శుభ్రం చేసిన జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు



బురద, వ్యర్థాలను తొలగిస్తున్న జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీసులు

ఫిలింనగర్: గత కొంతకాలంగా కురిసిన కుండపోత వర్షాలతో ప్రధాన రహదారులతో పాటు జంక్షన్లు వరదనీటితో నిండిపోతుండగా ట్రాఫిక్ స్తంభించిపోతూ వాహనాల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. దీంతో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఏ.ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో శనివారం పోలీసులు పారలు, గంపలు చేతబట్టుకుని వరదనీటి కాలువల వద్ద పేరుకున్న బురద, మట్టి, వ్యర్థాలు, చెత్తా చెదారం తొలగించారు. ఆపరేషన్ వాటర్ లాగింగ్ పాయింట్ పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు చేయి చేయీ కలిపి వరదనీటి మార్గాలను శుభ్రం చేశారు. మ్యాన్‌హోళ్ల రంధ్రాల్లో పేరుకుపోయిన మట్టిని, చెత్తను తొలగించారు. శ్రీకృష్ణానగర్, మంగోలియా బేకరీ, నీరూస్ జంక్షన్, తాజ్‌మహల్ హోటల్ ప్రాంతాల్లో పోలీసులు వరదనీరు వెళ్లే మార్గాలపై దృష్టిపెట్టి క్లీన్ చేశారు.

పేద విద్యార్థులకు ఆర్థిక సాయం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నల్లకుంటలోని మాత వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పీజీ, బీటెక్ చదువుతున్న పేద విద్యార్థులైన శ్రావణ్, కొండా శివతేజలకు రూ. 17 వేలు, రూ. 10 వేల ఆర్థిక సాయం చేశారు. ఉన్నత చదువుల నిమిత్తం ఈ సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు మాట్లాడుతూ... విద్యాదానం మహాదానం అని పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తమ క్లబ్ తరఫున ఆర్థిక చేయూతతో పాటు ఇతర సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కేశవచంద్ర తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో పరిపూర్ణ ఆరోగ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: చిరుధాన్యాలను క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ద డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని డీఎస్‌డీ సంస్థ రాష్ట్ర కార్యాలయంలో చిరుధాన్యాలు, గానుగ విధానంలో తీసిన వంట నూనెల వినియోగంపై ఆ సంస్థ జాతీయ కో కన్వీనర్ భారతితో కలిసి ఆహార ధాన్యాల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ప్రసాద్ మాట్లాడుతూ... నిత్యం నడక, వ్యాయామంతో పాటు కొర్రలు, సామలు, ఊదలు, ఆరికలు, అండు కొర్రలు వంటి చిరుధాన్యాలు తీసుకుంటే ఆరోగ్యానికి మేలు చేకూరుతుందన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి చేయాలి



పోచమ్మ ఆయంలో పూజలు నిర్వహిస్తున్న రాజేందర్

ముషీరాబాద్: దేవాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని ఎన్ఆర్ఐ ఆనందేషీ రాజేందర్ అన్నారు. శనివారం రాంనగర్ డివిజన్ జెమిని కాలనీ పోచమ్మ ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గర్భగుడి ముఖ ద్వారానికి వెండి తొడుగు కోసం 20 కేజీల వెండిని సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

అడ్డగుట్ట: బడీడు పిల్లలను బడుల్లో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని తుకారాంగేట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపల్ నిర్మల అన్నారు. శనివారం తుకారాంగేట్‌లోని మరాఠా బస్తీలో అంగన్‌వాడీ పిల్లలతో కలిసి టీచర్లు ఇంటింటికి వెళ్లి బడిబాటపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నిర్మల మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు విద్యాశాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. చాలా మంది తల్లిదండ్రులు వారి పిల్లలను పనులకు పంపించి వారి జీవితాలను చిన్నాభిన్నం చేస్తున్నారని అలా చేయకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శోభ, అడ్డగుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాల టీచర్ ప్రతిభ, స్థానికులు ప్రవీణ్‌కుమార్, జయప్రకాష్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



సుజాత

నల్లకుంట: అమ్మమ్మ ఇంటికి వెళుతున్నానని చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగుచూసింది. అడ్మిన్ ఎస్ఐ శ్రీనివాస్ రావు సమాచారం మేరకు... కమలీలు సుజాత(47) కుటుంబ సభ్యులతో కలిసి తిలక్‌నగర్ ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటోంది. రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఈ నెల 7న ఉదయం 9 గంటల సమయంలో కాచిగూడలో నివాసముండే తన గ్రాండ్ మదర్ కె.జయంతి బాయి ఇంటికి వెళ్లి అక్కడి నుంచి ఆస్పత్రికి వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులతో చెప్పి వెళ్లింది. అక్కడికి వెళ్లిన ఆమె మధ్యాహ్నం 2 గంటల సమయంలో సుజాత తన పర్స్, సెల్ ఫోన్ అక్కడే పెట్టి ఎక్కడికో వెళ్లిపోయింది. అమ్మమ్మ జయంతి వెంటనే సుజాత కుమారుడు కె.భార్గవ్‌కు ఫోన్‌చేసి విషయం చెప్పింది. కుటుంబ సభ్యులు ఆమె కోసం అన్ని చోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన భార్గవ్ తమ తల్లి కనిపించడం లేదంటూ శనివారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశారు. మిసింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'నీట్' నిర్వహణపై విచారణ జరిపించాలి'

ముషీరాబాద్: మెడికల్, డెంటల్ వైద్య విద్యలో ప్రవేశం కోసం నిర్వహించే నేషనల్ ఎలిజబులిటీ కమ్ ఎంట్రెన్స్ టెస్ట్ (నీట్) పరీక్ష నిర్వహణ, ఫలితాలపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామకృష్ణ, మరో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురాములు డిమాండ్ చేశారు. పరీక్షను సక్రమంగా నిర్వహించనందున విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని తెలిపారు. ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడం వారిలో 8 మంది ఒకే కేంద్రం కావడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నీట్ ఫలితాలను 14న విడుదల చేయాల్సి ఉండగా హఠాత్తుగా లోక్‌సభ ఫలితాలు వెలువడిన తేదీ రోజే అంటే పది రోజులకు ముందే విడుదల చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. గ్రేస్ మార్కుల కేటాయించిన తీరు పలు అనుమానాలకు తావిస్తుందని దేశ చరిత్రలో 67 మందికి ఒకే ర్యాంకు రావడం మొదటిసారి అన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

జనగామకు సర్వాయి పాపన్న పేరు హర్షణీయం

ఉస్మానియా యూనివర్సిటీ: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న పేరు పెట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షణీయమని కాంగ్రెస్ నేత, గౌడ ఉద్యమ జాతీయ అధ్యక్షులు డా.వట్టికూటి రామారావుగౌడ్ పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో సామాన్య కార్యకర్తనైన నేను సీఎం రేవంత్ రెడ్డిని నెల రోజుల్లో ఆరు సార్లు కలుసుకోవడం ఆనందంగా ఉందని రామారావుగౌడ్ పేర్కొన్నారు.